మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం

TGBIL/25/A0512

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం
30 ఆగస్టు 2026

పేజీలు : 4

@mvaartanews
www.mivaartanews.com


# హలో మాల - చలో సెక్రటేరియట్ కు భారీగా తరలి రండి.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపై కక్ష సాధింపు చర్యలు మానాలి.
- జీవో నెంబర్ 99 మాలల భవిష్యత్తుని చిద్రం చేస్తుంది.
- రోస్టర్ ని సవరించే వరకు పోరాటం ఆగదు.
- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్.

**కొతగూడెం ఆగస్టు 29 మీ వార్త ఆర్ సి:**

మాలల విద్యా ఉద్యోగ అవకాశాలకు అడ్డంకి గా మారిన రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలని, మాలల భవిష్యత్తుని అంధకారం చేస్తున్న 99 జీవో ని ఎత్తివేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాలల విద్య, ఉద్యోగ అవకాశాలలో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని కోరుతూ రేపు (సోమవారం) జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో జరిగే చలో సెక్రెటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దానిలో భాగంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని లారీ అసోసియేషన్ హాలో మాల చలో సెక్రెటేరియట్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరణ చేసి తప్పిదం చేయడమే కాక, రోస్టర్ పాయింట్లను కేటాయించడం, మాలల భవిష్యత్తుకు అంధకారంగా మారిన 99 జీవోని విడుదల చేసి మాలలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపట్ల కక్ష సాధింపు చర్యలకు దిగారని విమర్శించారు. దశాబ్దాలకాలంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వెన్ను దన్నుగా నిలుస్తున్న మాలలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మాలలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్ పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, రోస్టర్ పాయింట్లను 20 పాయింట్లు రెండు పాయింట్లు కేటాయించాలని, మాలల భవిష్యత్తుని చిద్రం చేస్తున్న 99 జీవోని ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాలల డిమాండ్ల సాధనకై రేపు (సోమవారం) జరిగే చలో సెక్రెటేరియట్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మాల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమల్ల సుందర్రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడెల్లి గణపతి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లంటి రమేష్, సింగరేణి రిటైర్డ్ మేనేజర్ శనగ వెంకటేశ్వర్లు, నాయకులు పెంకి శ్రీనివాస్, కాలే పుల్లయ్య, కూరపాటి దాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బోడ దివ్య, జిల్లా నాయకులు గుర్రం వెంకటరత్నం, శనగ రామచందర్, వల్లంటి హరీష్, గొర్రె ముచ్చు సుధాకర్, గడదేసి ప్రభాకర్, శెట్టి కమలాకర్, కాలే కాంతయ్య, గొల్లమల్ల రత్నం, జిల్లా యూత్ అధ్యక్షులు వాసుమల్ల గౌతం, దారా సాత్విక్, గుండమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# ధరల మంటల్లో సామాన్యుడు.

- బీజేపీ పాలనలో ప్రజలపై పెరుగుతున్న భారాలు.
- కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు.

**కామేపల్లి ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**

దేశం లో నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకూ పెరుగుతూ సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరంగా మారుస్తున్నాయని కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు శనివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పప్పులు, నూనెలు, కూరగాయలు,చక్కెర తదితర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో ప్రతి కుటుంబంపై అదనపు ఆర్థిక భారం పడుతోందని అన్నారు. ప్రజలకు అచ్చే దిన్ తెస్తామని చెప్పి ధరల భారంతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు అంటూ



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజల కష్టాలను పట్టించు కోకుండా ధరల నియంత్రణలో విఫలమైన బీజేపీ ప్రభుత్వ విధానాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. నిత్యావసర ధరలను తక్షణమే అదుపులోకి తీసుకురావాలని, సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని సామాన్యుడి గొంతుకగా నిలుస్తాం అన్నారు.

## జీపీడీపీ లో జిల్లా ప్రధమ స్థానం సాధించిన రాజేశ్వరపురం.




**నేలకొండపల్లి ఆగస్టు 29 మీ వార్త ఆర్ సి:**

గ్రామ పంచాయతీ యాక్షన్ ప్లాన్ ను తయారీ లో జిల్లా స్థాయిలో రాజేశ్వరపురం పంచాయతీ ప్రధమ స్థానం సాధించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది జీపీడీపీ యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు పంచాయతీ పాలకవర్గం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి జిల్లా పంచాయతీ అధికారులకు అందించారు. పంచాయతీ కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే 16 వ ఆర్థిక సంఘం నిధులను ఎలా వినియోగిస్తారో పంచాయతీ తీర్మానం చేసి పనులు అమోదం పొందారు. మొత్తం రూ.15 లక్షల నిధుల కు గాను రూ.7 లక్షలు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం కు కేటాయించారు. తాగునీటి సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.నీరు కలుషితం కాకుండా తీసుకునే చర్యలను అమోదించారు. అదే విధంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు మురుగు నీరు లేకుండా. ఎప్పటికప్పుడు డ్రైయినేజీ లను శుభంచేయటం తదితర పనులను ఏడాది సకాలంలో పూర్తి చేసే విధంగా యాక్షన్ ప్లాన్ ను తయారు చేసి ఆదర్శంగా నిలిచారు. జిల్లాలోనే జీపీడీపీ లో తొలిసారిగా యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేసి.98 శాతం పీడీపీ స్కోర్ ను సాధించారు. శనివారం పంచాయతీరాజ్ అధికారులు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ దండా రంగయ్య, కార్యదర్శి కె.నరేష్ లు మాట్లాడారు.పాలకవర్గం సభ్యులు, గ్రామస్తుల సహాకారంతో యాక్షన్ ప్లాన్ను సిద్ధం చేసినట్లు తెలిపారు.వీరిని ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారియం. శ్రీనివాసరావులు అభినందించారు.

## పరిచయం అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రుల ఆశాయాలను సాధించాలి" - ఎమ్మెల్యే జారె.

- సత్తుపల్లి సాయి ప్రేరణ సాంకేతిక కళాశాల" లో సాయి స్ఫూర్తి సాంకేతిక విద్యా సంస్థ.
- స్థానిక ఎమ్మెల్యే మట్టా రాఘమయి తో పాటు ఈ కార్యక్రమానికి హాజరైన, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.

**దమ్మపేట ఆగస్టు 29 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:**



ఎమ్మెల్యే ఆదినారాయణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, కష్టపడి చదివి ఉన్నత స్థాయి చేరాలని, తమ పై పెట్టుకున్న లక్ష్యాలను సాధించడానికి ఎంతో కృషి చేయాలని కోరారు. విద్య తో పాటు క్రమశిక్షణ, నడవడిక, సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని తెలియజేశారు. ప్రతి విద్యార్థి తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఉన్నత స్థాయికి చేరుకునేలా లక్ష్యాలను నిర్దేశించుకుని దానిని సాదించే విదంగా కృషి చేయాలని కోరారు. కష్టపడితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, పిల్లలు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పని చేసి చదివిస్తున్నారని విద్యార్థులకు తెలియజేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలు మరియు వ్యాయామం చెయాలని విద్యార్థులకు తెలియజేశారు.

## గోల్డ్ మెడల్ సాధించిన పరుగుల రాణి.

**కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న నల్లవెల్లి ఆనంది బంగారు పతకం సాధించారు. హనుమకొండ జేఎన్ఎం స్టేడియంలో 12 తెలంగాణ స్టేట్ మీట్ సౌత్ జోన్ ఆథెనెటిక్ ఛాంపియన్షిప్ 18 ఇయర్స్ విభాగంలో 400 మరియు 200 మీటర్స్ రాష్ట్రస్థాయి గోల్డ్ మెడల్ సాధించి సెప్టెంబర్ నెల పాండిచేరిలో జరిగే సౌత్ జోన్ నేషనల్ మీట్ కు నల్లవెల్లి ఆనంది ఎంపికైంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి కోచ్ సుబ్బారావుఆనందిని అభినందించినారు. ఏఎంసీ చైర్మన్ వైనాల రాజులైన్స్ క్లబ్ చైర్మన్ సాన రామకృష్ణారెడ్డి, లైన్స్ క్లబ్ సభ్యుడు లయన్ జబ్బార్ ఖాన్, బండ సాయి శంకర్ లు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నారాయణ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు.

**ఖమ్మం ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**







తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నారాయణ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష యొక్క గొప్పతనం, ప్రాచీనత సాహిత్య వైభవాన్ని ప్రతిబింబించే ప్రసంగాలు, పద్య పఠనాలు, వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి నవీన్ కుమార్ మాట్లాడుతూ తెలుగు భాష మన సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రతి విద్యార్థి మాతృభాష పట్ల గౌరవం కలిగి ఉండాలని సూచించారు. ప్రముఖ భాషా సంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. విద్యార్థులు తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించగా, ఉపాధ్యాయులు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలుగు భాష పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## అతిథి అధ్యాపకుల దరఖాస్తులకు ఆహ్వానం.

**సత్తుపల్లి ఆగస్టు 29 మీ వార్త టౌన్ రిపోర్టర్:**



జేవియర్ ప్రభుత్వ కళాశాల సత్తుపల్లి నందు ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టేందుకు గాను అతిథి అధ్యాపకుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ గోపి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషనర్ వారి ఉత్తర్వుల మేరకు 2026-27 సంవత్సరానికి గాను కళాశాలలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ సైన్స్ (01) కామర్స్ (01) పోస్టులకు సంబంధించిన అతిథి అధ్యాపకుల నియామకాలు డెమో ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా చేపట్టనున్నట్లు తెలియజేశారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు పీజీలో 55శాతం మార్కులు ఎస్సీ ఎస్టీ దివ్యాంగులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని నెట్/ సెట్/ పి హెచ్డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు.కళాశాల కమిషనర్ నిబంధనలమేరకు నియామక ప్రక్రియ ఉంటుందని ఆసక్తి గల అభ్యర్థులు 01-09-2026 మంగళవారం సాయంత్రం నాలుగు గంటల లోపు పూర్తి బయోడేటా తో పాటు జిరాక్స్ సర్టిఫికెట్స్ జతచేసిన అప్లికేషన్ జేవియర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సత్తుపల్లి నందు సమర్పించగలరని అన్నారు.

## ఆసరా పెన్షన్లకు దరఖాస్తు గడువు పెంచాలి.

- న్యూ డెమోక్రసీ నేత శివ నాయక్.

**కారేపల్లి ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**



ఆసరా పెన్షన్లకు దరఖాస్తు గౌడవనుఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 20 కు పెంచాలి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఖమ్మం జిల్లా నాయకులు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కారేపల్లి లో శనివారం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు ఆసరా పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటన చేసినప్పటికీ ఆగస్టు నెలలో ఎక్కువ రోజులు సెలవు రావడం సంబంధిత అధికారులు అందుబాటులో లేదని అన్నారు. ఎం.ఆర్.ఓ ఆస్ఐ జిపిఓ సంబంధిత అధికారులు లబ్ధిదారులకు వేరే వేరే కారణాలు రీత్యా అందుబాటులో లేకపోవడం మీ సేవ కేంద్రాల వద్ద సాఫ్ట్వేర్ సిగ్నల్ సరిగా రాలేదన్నారు. దీంతో సర్వర్ డన్ కావడం తద్వారా జిల్లా వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షల మందికి అన్యాయం జరిగే ప్రమాదం ఉన్నదని జిల్లా కలెక్టర్ కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసి ఆసరా పెన్షన్లకు గడువును పెంచాలని ఆగస్టు 30న చివరి తేదీని సెప్టెంబర్ 20 కు మార్చాలని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

## కేజీబీవీ విద్యాలయంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు.

**కారేపల్లి, ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**



సింగరేణి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రత్యేక అధికారిని జీ.ఝాన్సీ సౌజన్యతో కలిసి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల డైరెక్టర్ వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు, భాషావేత్త గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. తెలుగు భాష వ్యవహారిక రూపం రావడానికి గిడుగు వారి కృషి ఎనలేనిదన్నారు. తల్లి లాంటి తెలుగు భాషను మనం ఎప్పటికి మరవరాదన్నారు. తెలుగు భాష గ్రాంధిక రూపం నుంచి వ్యవహారిక రూపం రావడానికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి మరవరాదన్నారు.

## టేకు చెట్లు నరికివేతపై డి ఆర్ ఓ విచారణ.

**కారేపల్లి ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**



సింగరేణి మండల కేంద్రంలో గల పట్టా భూమిలో నరికివేసిన టేకు చెట్లపై అటవీశాఖ టాస్క్ ఫోర్స్ డీఆర్ ఏ.నాగమణి శనివారం విచారణ చేపట్టారు. కారేపల్లి గ్రామానికి చెందిన మన్నేపల్లి జయ తన భూమిలో గల 30 టేకు చెట్లను గుట్టుచప్పుడు కాకుండా కారేపల్లికి చెందిన ఓ కలప వ్యాపారి నరికి వేశాడని జిల్లా ఫారెస్ట్ అధికారికి ఫిర్యాదు చేసింది. అందులో భాగంగా డి ఎఫ్ ఓ ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ డీఆర్ఏ నాగమణి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.ఏడుకొండలు, బీట్ ఆఫీసర్ ఆర్.ప్రసాద్, స్థానిక బీట్ ఆఫీసర్ బి.రవి, శ్రీకాంత్ చెట్లు నరికిన ప్రదేశాన్ని పరిశీలించారు. దర్యాప్తు పూర్తి విచారణ నివేదికను డీఎఫ్ఏకు అందజేయనున్నట్లు డీఆర్ఓ తెలిపారు.

## కొలువుదీరిన కోట మైసమ్మ తల్లి.

**- 31వ తేదీన కోట మైసమ్మ జాతర వేలం పాటలు.**



**కారేపల్లి ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:** మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి లో గల కోట మైసమ్మ తల్లి ఆలయంలో దసరా పండుగ సందర్భంగా నిర్వహించే దుకాణాల వేలం పాటలు సోమవారం జరగనున్నాయి దసరా పండుగ సందర్భంగా జాతరలో విక్రయించే దుకాణాల సముదాయాలకు అధికారులు వేలంపాటలకు ఆహ్వానించారు. కోట మైసమ్మ జాతరలో పుట్నాలు పేలాలు. మిఠాయి అమ్ముకునే హక్కులకు సంబంధించి వేలం పాటలు నిర్వహించనున్నారు. సకాలంలో వ్యాపారులు పాటలకు హాజరుకావాలని ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ డాక్టర్ పట్టాభి రామారావు, వెంకటయ్య తెలిపారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఒకటవ క్యాటగిరి వేతనాలు చెల్లించాలనిసెప్టెంబర్ 1న చలో కొత్తగూడెం.

**- కాంట్రాక్టు కార్మికుల ప్రదర్శన.**




**కొత్తగూడెం ఆగస్టు 29 మీ వార్త ఆర్ సి:** సింగరేణి కాంట్రాక్టు కార్మి కులకు ఒకటవ క్యాటగిరి వేతనాలు చెల్లించాలని, వివిధ రంగాల్లో కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, చట్టబద్ధమైన హక్కు లను అమలు చేయాలని, మిడ్ డే మీల్స్,కేజీబీవీ, హాస్టల్ వర్కర్స్ తదితర స్కీం కార్మికులశీదరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సెప్టెంబర్ 1న కొత్తగూడెం సిఈఆర్ క్లబ్ లో జరగనున్న సదస్సును జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. సీతారామయ్య విజ్ఞప్తి చేశారు. 1న సదస్సు-ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ కొత్తగూడెంలో సంఘం ఆధ్వర్యంలో రైటర్ బస్తి నుండి బస్టాండ్ వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నెమిల్ల సంజీవ్ అధ్యక్షతన జరిగిన సభలో సీతారామయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టియు రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వర రావు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి నెమిల్ల సంజీవ్, సంధ్య, కరుణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పెన్షన్స్ ఆన్లైన్ గడువు ను పొడిగించాలి.

**- 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ విజ్ఞప్తి**




**కొత్తగూడెం ఆగస్టు 29 మీ వార్త ఆర్ సి:** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆసరా పెన్షన్స్ ఆన్లైన్ గడువును రెండు వారాలకు పెంచాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ నేడు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల ఆగస్టు 31తో ఆన్లైన్ గడువు ముగుస్తుండటం తో ఈ మధ్యలో చనిపోయిన వారి మరణ ధ్రువీకరణ పత్రము, ఆదాయ ధ్రువీకరణ పత్రం తదితర పత్రాలను సమకూర్చుకునే గడు లేక అర్హులైన వితంతు పెన్షన్ ఆశాభావులు మనో వేదనకు గురవుతున్నారని, ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఈనెల 31 గడువు తేదీని మరొక రెండు వారాలకు పెంచాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు.



**నేలకొండపల్లి ఆగస్టు 29 మీ వార్త ఆర్ సి:** నేలకొండపల్లి మండల కేంద్రంలో శనివారం అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో అభిమానులు కేక్ కటింగ్ చేసి ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి హాజరయ్యారు. ఈ సంధర్భంగా దివ్యమూర్తి మాట్లాడుతూ హాకీ మహావీరుడు ధ్యాన్ చంద్ పుట్టినరోజు సందర్భంగా ఈ యొక్క క్రీడా దినోత్సవాన్ని నిర్వహించు కుంటున్నామని, క్రీడలు శరీరానికి బలాన్ని మనసుకు ఉల్లాసాన్ని ఇస్తాయని, క్రీడలు క్రమశిక్షణకు కృషికి పునాది అని, క్రీడలు ఐక్యతను స్నేహాన్ని పెంపొందిస్తాయని, క్రీడల యొక్క గొప్పతనాన్ని క్రీడాకారులు ప్రజలు తెలుసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభిమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరేపల్లి జ్ఞానరత్నం, జాతీయ సామాజిక అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు,అభిమానుల సంఘం రాష్ట్ర యూత్ వైస్ ప్రెసిడెంట్ వడ్లమూడి శ్రీనివాసరావు, అభిమానుల సంఘం నియోజకవర్గ ప్రచార కార్యదర్శి బొల్లికొండ పిచ్చయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు పొట్ట పింజర బాలస్వామి, బిఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షులు మాదాసు ఆదాం, తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షణతో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి.

**- రూ. 95.50 లక్షల సుడా నిధులతో రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల.**

**ఖమ్మం ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**



నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్లో రూ. 95.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి, పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు.అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగు పడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి.

**- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు.**
**- దోమల నివారణకు చర్యలు.**
**- గిద్దే వారి గూడెం సర్పంచ్.**

**కారేపల్లి ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**



వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన పడకుండా పంచాయితీలో ప్రధాన రహదారి మార్గాల మరమ్మత్తులతో పాటు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించామని గిద్ద వారి గూడెం గ్రామ సర్పంచ్ వీసాల వెంకటేశ్వర్లు అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో శనివారం సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమేష్ పర్యవేక్షణలో వైద్య గ్రామపంచాయతీ సిబ్బందిపారిశుధ్య పనులతో పాటు మురికి నీరు ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు..ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన రహదారి మార్గాలపై వరద నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.. గ్రామస్తులు ఇళ్లలో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది చేస్తున్న పనులకు ప్రజల సహకారం ఉండాలన్నారు. వర్షాకాలం వచ్చిందంటే రహదారుల ప్రక్కన వరదనీరు ఆగిపోవడంతో ఇబ్బందికరంగా మారేది అన్నారు. వరద నీరు తొలగించడమే కాకుండా మురికి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు అంతర్ రహదారులకు సీసీ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. వార్డుల వారీగా సమస్యలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక కు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవవేడుకలు.

**కొత్తగూడెం ఆగస్టు 29 మీ వార్త ఆర్ సి:**






సింగరేణి ఉన్నత పాఠశాల పీ వీ కాలనీ మణుగూరు నందు వ్యవహారిక భాషోద్యమ పితామహులు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి ని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్నిఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా సింగరేణి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఏజిఎం పర్సనల్ యస్. రమేష్ విచ్చేసి తెలుగు భాషా గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. తెలుగు భాషను అందరూ ప్రేమించాలని, తెలుగు భాషలో అక్షర దోషాలు లేకుండా విద్యార్థులు రాయాలని, తెలుగు భాష పైన పట్టు సాధించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేసే నాటికలు, పాటలను విద్యార్థులు ప్రదర్శించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.కళ్యాణి మాట్లాడుతూ.. నేటి కాలంలో తెలుగు భాష నిరాజరణకు గురవుతుందని అందరూ తెలుగు భాషను పట్ల మమకారాన్ని పెంచుకోవాలని మాతృభాష అయిన తెలుగు భాషను మర్చిపోరాదని తెలియజేశారు. సీనియర్ తెలుగు ఉపాధ్యాయులు ఏం.వేణు మాట్లాడుతూ.. తెలుగు భాష ఎంతో అందమైన భాషని తెలుగు భాషలో ఉండే చంధస్సు, అలంకారాలు, జాతీయాలు తెలుగు భాష గొప్పతనాన్ని చాటి చెప్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తానయ్యా, లక్ష్మి, దయానంద్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం.

**కారేపల్లి ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**



గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని శనివారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నోముల విజయకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నోముల విజయకుమారి మాట్లాడుతూ.. పూర్వం తెలుగు భాష గ్రాంధిక భాషలో ఉండటంతో సామాన్య ప్రజలకు అర్థం చేసుకోవడం కష్టంగా ఉండేదన్నారు. గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషి ఫలితంగా వ్యవహారిక భాషకు ప్రాధాన్యం పెరిగి, తెలుగు భాష సామాన్యులకు సులభంగా అర్థమయ్యేలా మారిందని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అనంతరం తెలుగు అధ్యాపకురాలు సుధారాణిని కళాశాల తరపున శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తూ "దేశభాషలందు తెలుగులెస్స" అని పేర్కొన్నారు. తెలుగు భాష ప్రాశస్త్యం,విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని తెలుగు భాష పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రైతు కమిషన్ బృందం.



**కామేపల్లి ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**

సీఎం రేవంత్ రెడ్డిని రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రామిరెడ్డి, కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, కెవిన్ రెడ్డి, భవాని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. అనంతరం రెండు గంటల పాటు రైతు కమిషన్ కార్యకలాపాలతో పాటు పలు రాజకీయ పరిణామాలపై చర్చించారు. కమిషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్న సీఎం రైతు సం క్షేమం కోసం వారికి పలు సూచనలు చేశారు.

## మూడు కృష్ణ ప్రసాద్ ను పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు.




**కామేపల్లి ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**

కామేపల్లి మండల బిఆర్ఎస్ నాయకులు, కొమ్మినేపల్లి మాజీ సర్పంచ్ మూడు కృష్ణ ప్రసాద్ నాయక్ ను శనివారం మండల బిఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. అనారోగ్యానికి గురికావడంతో కృష్ణ ప్రసాద్ నాయక్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మనో ధైర్యం కల్పించారు. త్వరితగతిన కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో మండల మాజీ అధ్యక్షులు అంతోటి అచ్చయ్య, మండల నాయకులు సామ మోహన్ రెడ్డి, బానోత్ మంగు, గడ్డం వెంకటేశ్వర్లు, మూడు శ్రీను, కన్నమాల రాంబాబు, చిప్పలపల్లి శ్రీనివాసరావు, ఆదూరి ప్రసాద్, ముత్యం రామ కృష్ణ, ధరావత్ రాందాస్, నాయక్, మధు, సూర్య, భాను ప్రసాద్, బొంగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం క్రీడా, పర్యాటక రంగాలకు మరింత ఊపు.

- రూ.92.76 కోట్లతో అంతర్జాతీయ స్థాయి క్రీడా సముదాయం.
- ఖమ్మం ఖిల్లా రోప్‌వే, హరిత హోటల్, హరిత భవన్ పనులు వేగవంతం చేయాలి.
- శాట్ వీసీ అండ్ ఎండీ సోనీ బాలాదేవి, పర్యాటక శాఖ ఎండీ గౌతమితో మంత్రి తుమ్మల సమీక్ష.






**ఖమ్మం ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:** ఖమ్మం జిల్లాలో క్రీడా, పర్యాటక రంగాలను మరింత అభివృద్ధి చేసి, జిల్లాకు కొత్త గుర్తింపు తీసుకువచ్చేలా మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న పలు క్రీడా, పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.92.76 కోట్లతో అంతర్జాతీయ స్థాయి క్రీడా సముదాయం క్రీడా ప్రతిభకు పెట్టింది పేరైన ఖమ్మం జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయడంలో భాగంగా రఘునాధపాలెంలో రూ.92.76 కోట్లతో సమగ్ర క్రీడా సముదాయం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. జిల్లా కేంద్రం రఘునాధపాలెం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 218లో 20.00 గుంటల ప్రభుత్వ భూమిని జిల్లా యువజన క్రీడా శాఖకు అప్పగించారు. ఈ స్థలంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియంతో పాటు ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా సదుపాయాలతో కూడిన సమగ్ర క్రీడా సముదాయాన్ని నిర్మించాలని ప్రతిపాదించారు. మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ డీపీఆర్‌ఈ పూర్తిస్థాయి సాంకేతిక అంచనాలతో డీపీఆర్‌ను రూపొందించారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.92.76 కోట్లుగా అంచనా వేశారు. ఈ ప్రాజెక్టులో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి రూ.14.99 కోట్లు స్టేడియం వాణిజ్య సముదాయానికి రూ.8.98 కోట్లు 200 మంది క్రీడాకారుల సామర్థ్యంతో హాస్టల్ నిర్మాణానికి రూ.3.92 కోట్లు ప్రతిపాదించారు. అదేవిధంగా షూటింగ్ హాల్, ఆర్చరీ షెడ్, కబడ్డీ,ఖోఖో మల్టీపర్పస్ హాల్, బ్యాడ్మింటన్ కోర్టులు, వుషుబాక్సింగ్ హాల్, బాస్కెట్‌బాల్ కోర్టు, ఫుట్‌బాల్ మైదానం, జిమ్, స్విమ్మింగ్ పూల్, ఇండోర్‌అవుట్‌డోర్ క్రికెట్ ప్రాక్టీసింగ్ నెట్స్, పికిల్ బాల్ కోర్టు, కన్వెన్షన్ హాల్, అతిథి గృహం తదితర 28 రకాల క్రీడా, అనుబంధ సదుపాయాలను డీపీఆర్‌లో పొందుపరిచారు. ఈ ప్రాజెక్టుకు త్వరితగతిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, నిధులు విడుదల చేయాలని కోరుతూ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కలెక్టర్, ఛైర్మన్ దివాకర టీఎస్ ఐఏఎస్ మే 30న శాట్ వీసీ అండ్ ఎండీకి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో శాట్ వీసీ అండ్ ఎండీ సోనీ బాలాదేవి ఐఎఫ్ఎస్‌తో జరిగిన సమీక్షలో మంత్రి తుమ్మల ప్రాజెక్టు డీపీఆర్‌కు త్వరగా అనుమతి మంజూరు చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు. రఘునాధపాలెం క్రీడా సముదాయంతో పాటు ఖమ్మంలో ఇప్పటికే పూర్తయిన సింథటిక్ ట్రాక్ లో మౌలిక సదుపాయాల కల్పన, ఖమ్మం మల్టీపర్పస్ స్టేడియం, కొత్తగూడెం యూనివర్సిటీలో స్టేడియం నిర్మాణం తదితర ప్రాజెక్టుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. ఈ ప్రాజెక్టుల్లో ఎదురవుతున్న సమస్యలు, అనుమతులు, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి అవసరమైన చర్యలు తీసుకుని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి, క్రీడాకారులకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఖమ్మం జిల్లాలోని యువతలో ఉన్న క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు అత్యుత్తమ సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతులు అందుబాటులోకి వస్తే స్థానిక క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునేందుకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఖమ్మం జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. తెలంగాణ పర్యాటక శాఖ ఎండీ గౌతమి, ఐఏఎస్‌తో జరిగిన సమావేశంలో జిల్లాలో చేపడుతున్న వివిధ పర్యాటక ప్రాజెక్టులపై చర్చించారు. ప్రధానంగా కొత్తగూడెం హరిత హోటల్, ఖమ్మం హరిత భవన్, ఖమ్మం ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. కొత్తగూడెం హరిత హోటల్ నిర్మాణ పనులు గతంలోనే ప్రారంభమైనప్పటికీ మధ్యలో నిలిచిపోయిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. పనులు నిలిచిపోవడం వల్ల భద్రాచలం వచ్చే భక్తులు, పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, హరిత హోటల్ నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఖమ్మం హరిత భవన్ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే 5 ఎకరాల భూమిని కేటాయించినందున, సుమారు రూ.40 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. హరిత భవన్ అందుబాటులోకి వస్తే భద్రాచలం వచ్చే భక్తులతో పాటు కొత్తగూడెం ప్రాంతంలోని పారిశ్రామిక కార్మికులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి తెలిపారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వేను త్వరగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా నగర పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఖమ్మం ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, పర్యాటకులను ఆకర్షించేలా రోప్‌వేతో పాటు పరిసర ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సూచించారు. కొత్తగూడెం హరిత హోటల్, ఖమ్మం హరిత భవన్ వంటి ప్రాజెక్టులను కూడా త్వరగా పూర్తి చేసి పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. క్రీడా రంగంలో అత్యుత్తమ మౌలిక వసతులు, పర్యాటక రంగంలో ఆకర్షణీయమైన ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఖమ్మం జిల్లాను క్రీడా, పర్యాటక రంగాల్లో మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తుమ్మల తెలిపారు.

# రాష్ట్ర స్థాయి వాలీబాల్‌లో అశ్వారావుపేటకు ప్రథమ స్థానం.

**అశ్వరావుపేట ఆగస్టు 29 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:** జాతీయ స్థాయికి ఎంపికైన ఆసుపాక క్రీడాకారులను సన్మానించిన ఎమ్మెల్యే జారె. దమ్మపేట గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహించిన 18వ ఈషా గ్రామోత్సవం గ్రామీణ క్రీడా ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలోని రూరల్ ప్రీమియర్ లీగ్ 2026 లో అశ్వారావుపేట నియోజకవర్గం సత్తా చాటింది. రాష్ట్ర స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామానికి చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ జాతీయ స్థాయికి ఎంపికైన ఆసుపాక గ్రామ క్రీడాకారులను అభినందించి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకువచ్చిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని వారికి సరైన ప్రోత్సాహం అవకాశాలు లభిస్తే రాష్ట్ర జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థాయికి ఎదగగలరని ఆశభావం వ్యక్తం చేశారు. క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని జాతీయ స్థాయి పోటీల్లో కూడా అశ్వారావుపేట నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఆసుపాక క్రీడాకారులు సాధించిన ఈ విజయం నియోజకవర్గంలోని ఇతర గ్రామాల యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు యువత చెడు వ్యసనాలకు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల వేళ జిమ్మిక్కులా ?

- కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా సమ్మె నోటీసులా ?
- సెప్టెంబర్‌లోగా లాభాలు ప్రకటించి 40 శాతం వాటా ఇవ్వాలి.

**కొత్తగూడెం, ఆగస్టు 29 మన మీ వార్త:** సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య కార్మిక సంఘాలు రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జిమ్మిక్కులు చేస్తున్నాయని టీబీజీకేఎస్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కాపు కృష్ణ తీవ్రంగా విమర్శించారు. కొత్తగూడెంలోని టీబీజీకేఎస్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ 36 హామీలు, ఏఐటీయూసీ 48 హామీలు ఇచ్చాయని, రెండు సంవత్సరాల ఎనిమిది నెలలు కావస్తున్నా కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్మికులను ఆకట్టుకునేందుకు కొత్త ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. టీబీజీకేఎస్ హయాంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి రెండు నెలలకు ఒకసారి వైద్య బోర్డులు నిర్వహించేవారని కాపు కృష్ణ తెలిపారు. అనర్హత కేసుల్లో 80 నుంచి 90 శాతం వరకు పరిష్కారం చూపడంతో పాటు సుమారు 14 వేల మందికి వారసత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత టీబీజీకేఎస్‌కు, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం మూడు వైద్య బోర్డులు నిర్వహిస్తామని హామీ ఇచ్చిన ఏఐటీయూసీ, రెండేళ్లకుపైగా కాలంలో పరిమిత సంఖ్యలోనే వైద్య బోర్డులు నిర్వహిస్తూ 10 నుంచి 15 శాతం వరకు మాత్రమే అనర్హత కేసులకు పరిష్కారం చూపుతోందని విమర్శించారు. ప్రస్తుతం సింగరేణిలో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాపు కృష్ణ అన్నారు. జేఏఈటీల ప్రమోషన్ల కోసం రోడ్డెక్కి నిరాహార దీక్షలు చేయాల్సి రావడం గతంలో ఎన్నడూ లేని పరిస్థితికి నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏఐటీయూసీ ఆర్ఎల్‌సీకి సమ్మె నోటీసు ఇవ్వడం కార్మికుల సమస్యల పరిష్కారం కంటే రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణాలు, మారుపేర్ల సమస్య పరిష్కారం వంటి హామీలు కూడా అమలుకు నోచుకోలేదని కాపు కృష్ణ విమర్శించారు. వేతనాలపై ఆదాయపు పన్ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి రెండున్నరేళ్లలో కేవలం రెండు సమావేశాలు నిర్వహించడం మినహా కార్మికులకు ఆర్థికంగా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. కార్మికుల సమస్యలపై కేవలం కమిటీలు ఏర్పాటు చేయడం తప్ప పరిష్కారాలు చూపలేదని ఆరోపించారు. సింగరేణిలో ప్రస్తుతం ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని ఆయన అన్నారు. రెండు గుర్తింపు సంఘాలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిమ్మిక్కులు చేస్తున్నాయని,




అయితే కార్మిక వర్గం అన్నింటినీ గమనిస్తోందని పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, మారుపేర్ల సమస్యతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి లాభాలను సెప్టెంబర్‌లోగా ప్రకటించి కార్మికులకు 40 శాతం లాభాల వాటా ఇవ్వాలని కాపు కృష్ణ డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమతో సంస్థకు లాభాలు వస్తున్నందున ఆ లాభాల్లో వారికి న్యాయమైన వాటా కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఎన్నికల హామీలను పక్కనపెట్టి కార్మికుల వాస్తవ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శ్రీనివాస్ రావు , రాజశేఖర్, కె. విజయ్ కుమార్, కంచర్ల శ్రీనివాస్, మారపాక తిరుపతి, రవి వర్మ, సూర్యనారాయణ, ఎన్. వెంకట రెడ్డి, ఎన్. శంకర్ ,శ్రవణ్, జి. దేవా సింగ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జింకల బంజర పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేసిన కెప్టెన్ బంజర సర్పంచ్ అచ్చమ్మ.



కామేపల్లి ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి: కామేపల్లి మండలం జింకల బంజర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం యూనిఫాం ను పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాం ను కెప్టెన్ బంజర సర్పంచ్ ఆరెమ్ అచ్చమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం లను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జక్కుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు డి.శ్రీను, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ షాదీ ఖానా చైర్మన్ యాకూబలి.



**కారేపల్లి ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:**
సింగరేణి ఎత్తిండవే మండలంలో వివిధ గ్రామాల్లో నివసిస్తున్న మైనారిటీల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హామీ ఇచ్చారు. నూతన షాదిఖానా కమిటీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని మైనారిటీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను షాది ఖానా చైర్మన్ ఎండి యాకుబ్ అలీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సంబంధిత అంశాలపై పరిశీలన చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మైనారిటీల సంక్షేమం కోసం అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. మైనారిటీల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంపై షాదిఖానా కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్ పాషా, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్, మండల మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎండీ హనీఫ్, షేక్ షఫీ, షేక్ యాకుబ్ పాషా, షేక్ ఖదీర్, షేక్ జానీ, గూగులోత్ భీముడు, కృష్ణ, మంగ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## షాలేము బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె.

**దమ్మపేట ఆగస్టు 29 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:**



దమ్మపేట అంకంపాలెం సీయోను ప్రార్థనా మందిరంలో షాలేము బహుజన మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన నెలవారీ సమావేశానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు యూత్ కాంగ్రెస్ దమ్మపేట మండల అధ్యక్షులు పాస్టర్ కాకా రమేష్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ సమాజంలో శాంతి సేవా భావం సోదరభావం పెంపొందించడంలో పాస్టర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంతో పాటు సామాజిక సేవలోనూ పాస్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం సంఘంలో గౌరవ సలహాదారుగా కొనసాగుతున్న నిరీక్షణ రావు ఆర్థిక ప్రోత్సాహంతో మండల పరిధిలోని పాస్టర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన వస్త్రాలు హెల్మెట్లు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల షాలేము బహుజన కమిటీ పాస్టర్లు స్థానిక అంకంపాలెం సర్పంచ్ మోకాళ్ళ గురుమూర్తి, హైకోర్టు అడ్వకేట్ పెనుబల్లి రమేష్ బాబు, సంఘ పెద్దలు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు..

## రాఖీ కట్టిన కార్మిక మహిళలు.. కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్ రెడ్డి

**గోదావరిఖని :** రాఖీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం నాడు ఓల్డ్ అశోక్ మేస్త్రి అడ్డా టాపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్మిక మహిళలు హరీష్ రెడ్డి గారికి రాఖీలు కట్టి ఆశీర్వదించారు. హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక భద్రత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని, రానున్న రోజుల్లో కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసేందుకు మహిళలు, కార్మికులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దిగువ యాదగిరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జహీద్ పాషా, బక్కి కిషన్, కృష్ణస్వామి, చొప్పరి శ్రీనివాస్, నిమ్మరాజుల సాగర్, మేకల రామస్వామి, రంగు దుర్గాప్రసాద్, బోట్ల పోషం, రౌతు గణేష్, రిషి, మామిడాల రాము, బోడకుంట వెంకటలక్ష్మి, కడార్ల శ్రీధర్, బండి రాజు, దిడ్డి కుమార్, కొండ సురేష్, నిజం, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో గోదావరి పుష్కర ఘాట్ల నిర్మాణాలు.

- గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రారంభమైన పుష్కర పనులు.
- భూమిపూజా కార్యక్రమంలో పాల్గొన్న భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్.
- నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ పర్యవేక్షణలో రు. 46.65 కోట్లు నిధులతో ముదుదశల్లో ఘాట్ నిర్మాణాలు.






**భద్రాచలం ఆగస్టు 29 మన మీ వార్త:** భద్రాచలంలో వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలు - 2027 కోసం ఏర్పాట్లలో భాగంగా ఘాట్ల నిర్మాణాలు శనివారం ప్రారంభమైనాయి. గోదావరి నది ఆయకట్టు పరివాహక ప్రాంతంలో ప్రారంభించిన ఈ పుష్కర పనుల కోసం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ క్రమంలో వేద పండితులు జిల్లా కలెక్టర్,భద్రాచలం ఎమ్మెల్యేతో పూజలు నిర్వహించారు.అనంతరం జే.సీ.బీ సహాయంతో మట్టిని తీసి పుష్కర పనులను అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. గోదావరి పుష్కరాలు 2027 కు మూడు విడతలుగా పనులను శ్రీకారం చుట్టామని తెలిపారు. అందులో భాగంగా తొలి విడుత పనులు రు. 46.65 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించిందని పేర్కొన్నారు. రెండో విడత పనులు రు. 1.75 కోట్లు,మూడో విడత పనులు రు. 60 లక్షలు మొత్తం రు.49కోట్లతో ఈ పుష్కర ఘాట్ పనులు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే ఈడాది మార్చ్ నెల లోపు ఈ పనులన్నీ పూర్తి కానున్నాయని వెల్లడించారు.

మొదట భద్రాచలంలో పుష్కర ఘాట్ పనులు, అనంతరం దుమ్ముగూడెం మండలంలో పర్ణశాల, బూర్గంపాడు మండలంలో మోతే పట్టి నగర్ ప్రాంతాలలో ఘాట్ పనులు కొనసాగుతాయన్నారు.చివరగా ములుగు జిల్లాలోని చిన్నరావిగూడెం, రామానుజావరం, రామచంద్రాపురం ప్రాంతాలలో పుష్కర ఘాట్ పనులు జరగనున్నాయని తెలిపారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో వచ్చే ఏడాది 2027 జూన్, జూలై నెలలో నిర్వహించే గోదావరి పుష్కరాల భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పనులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సరిహద్దు ప్రాంతాలైన వాజేడు, వెంకటాపురం ప్రాంతాలలో ఈ పుష్కర ఘాట్ పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు.
ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం అభివృద్ధి మరమ్మత్తు పనులు రు. 351 కోట్లతో కొనసాగుతున్నాయని అన్నారు. ప్రతిరోజు జరుగుతున్న దేవాలయ మరమ్మత్తు పనులపై జిల్లా కలెక్టర్ అంకిత్, అధికారులు సమీక్షిస్తూ పనులు వేగవంతంగా చేపడుతునట్లు తెలిపారు. అదేవిధంగా గోదావరి పుష్కర పనులు సకాలంలో పూర్తిచేసేలా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు. ముఖ్యంగా ఆర్ అండ్ బి అధికారులు భద్రాచలం కరకట్ట ప్రాంతంలో సర్వీస్ రోడ్డు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేలా ప్రణాళిక చేపట్టి చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా పుష్కరాలకు వచ్చే భక్తులకు సౌకర్యార్థం స్నానాల ఘాట్, మరుగుదొడ్లు తదితర వసతులన్నీ పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. భద్రాచలం ప్రాంతాన్ని కంటికి రెప్పలా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం టెంపుల్ ఈ.వో దామోదర్ రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ సీ.ఈ శ్రీనివాస్ రెడ్డి,ఎస్.ఈ మహేశ్వర రావు, డీ.ఈ సబ్ డివిజన్ -1 భాగ్యరాజ్ రాథోడ్, ఈ.ఈ జానీ, భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణ, పంచాయతీ ఈ.వో శ్రీనివాస్, తహసీల్దార్ రవి, వార్డు సభ్యులు సుబ్బా రావు, స్థానికులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, బుడగం శ్రీనివాస్, ఏ.ఈ.ఈ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టోలెసెంట్ అంటే ఎవరు?

**డాక్టర్. డి.సి.తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్**

**కరీంనగర్ :** డాక్టర్. డి.సి.తిరుపతిరావు మాట్లాడుతూ సెప్టోలెసెంట్ అంటే 70 సంవత్సరాలు దాటిన పురుషుడు లేదా మహిళ, కానీ సంప్రదాయ పద్ధతిలో వృద్ధాప్యాన్ని అంగీకరించకుండా, జీవితం పట్ల ఉత్సాహంతో, ప్రత్యేకమైన జీవనశైలిని ఎంచుకునే వ్యక్తి. వారి లక్షణాలు ఇవి: వారు ఎప్పుడూ చురుకుగా ఉంటారు. ఉద్యోగం చేయవచ్చు, చదువుకోవచ్చు, లేదా తమను ఆలోచింపజేసే, ఉపయోగకరంగా అనిపించే ఏదైనా కొత్త కార్యక్రమాన్ని సృష్టించుకోవచ్చు.వారికి కనీసం ముగ్గురు మంచి స్నేహితులు ఉంటారు. వారితో కాఫీ, నీరు లేదా వైన్ తాగుతూ తరచూ కలుసుకుంటారు.వారు విలాసాలకు దూరంగా ప్రయాణిస్తూ కొత్త ప్రదేశాలు, సంస్కృతులను అనుభవిస్తారు. అయితే జీవితంలోని మంచి విషయాలను ఆస్వాదించడం మాత్రం మానరు. జీవిత భాగస్వామి, పిల్లలు, మనవలు-మనవరాళ్లు మరియు బంధువులతో ప్రేమ, గౌరవం, పరస్పర సహకారంతో కూడిన సంబంధాలను కొనసాగిస్తారు.వారు ఆశావాదులు, ఉత్సాహవంతులు. ఎప్పుడూ ఒక కొత్త ప్రాజెక్ట్ లేదా లక్ష్యాన్ని మనసులో ఉంచుకొని జీవితంలో నిలిచిపోకుండా ముందుకు సాగుతారు.ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటారు. అనారోగ్యాలను జీవితంలో భాగంగా స్వీకరిస్తారు. రోజుకు కనీసం 20 నిమిషాలు నడుస్తారు మరియు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటారు.చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని వెతుక్కుంటారు. అది పుట్టినరోజు కావచ్చు, ఒక వేడుక కావచ్చు, ఇష్టమైన సీరీస్ కావచ్చు లేదా కొత్త రోజు కావచ్చు. ప్రతి రోజుకు దేవునికి కృతజ్ఞతలు తెలుపుతారు.రోజంతా తమకు లభించే మంచి విషయాల పట్ల కృతజ్ఞతతో ఉంటారు. ఇతరులకు మేలు చేయడానికి ప్రయత్నిస్తారు.ప్రతిరోజూ చిరునవ్వుతో ఉంటారు. ఎందుకంటే ఇతరులు గమనించని, మెచ్చుకోని ఎన్నో అందమైన విషయాలను వారు ఆస్వాదిస్తారు.తమ వద్ద లేని వాటి గురించి బాధపడకుండా, ఉన్న వాటితో సంతోషంగా జీవిస్తారు. అందుకే వారు తమను తాము కోటీశ్వరుల్లా భావిస్తారు.నేను మిమ్మల్ని కూడా ఒక సెప్టోలెసెంట్‌గా మారమని ఆహ్వానిస్తున్నాను.ఈ రోజుల్లో వృద్ధాప్యాన్ని ఆపడం అసాధ్యం. కానీ వృద్ధాప్యాన్ని హుందాగా, గౌరవప్రదంగా స్వీకరించడం మాత్రం పూర్తిగా మన చేతుల్లోనే ఉంది అని డాక్టర్. డి.సి.తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ అన్నారు

# మణుగూరులో అప్పుడు భరోసా...
# కాంగ్రెస్ పాలనలో ఇప్పుడు భయమా?

- నేతాజీ గ్రౌండ్‌లో 28 ఏళ్ల యువకుడి మృతి ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి.

**మణుగూరు ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి:** మణుగూరు నేతాజీ గ్రౌండ్‌లో జరిగినట్లు వెలువడిన ఘర్షణ ఘటనలో 28 ఏళ్ల యువకుడు సింహాద్రి శివ మృతి చెందడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒక యువకుడి ప్రాణం పోయింది. ఒక కుటుంబం తీరని విషాదంలోకి వెళ్లింది. మణుగూరు తల్లిదండ్రుల్లో భయం, ఆందోళన నెలకొంది. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోంది? స్థానిక ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నారు? ప్రజలకు ఎందుకు స్పందించడం లేదు? యువత భద్రతపై ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? బీఆర్ఎస్ పాలనలో మణుగూరులో భరోసా ఉండేది బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో రేగా కాంతారావు నాయకత్వంలో మణుగూరు అభివృద్ధి, ప్రజా సమస్యలు, యువతకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి ఉండేది మణుగూరు నేతాజీ గ్రౌండ్‌ను రీ-మోడల్ చేసి, శుభ్రపరిచి, చుట్టూ మొక్కలు నాటి, ప్రజలకు యువతకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాం. బోశెట్టి రవి ప్రసాద్ అన్న, గుర్రం సృజన్ అన్నతో పాటు ఎంతోమంది బి ఆర్ యస్ యువజన, నాయకులు అలాగానే మా సీనియర్ నాయకులు యాదగిరి గౌడ్ 24/7 గ్రౌండ్‌పై దృష్టి పెట్టి, యువతను క్రీడలు, మంచి కార్యక్రమాల వైపు నడిపించే వాతావరణం కోసం కృషి చేశారు. అప్పుడుగ్రౌండ్ అంటే క్రీడలు యువత అంటే భవిష్యత్తు... మణుగూరు అంటే భరోసా! మరి ఇప్పుడు అదే నేతాజీ గ్రౌండ్‌లో ఇలాంటి విషాద ఘటన చోటుచేసుకోవడం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బి ఆర్ యస్ తరపున అడుగుతున్న ప్రశ్నలునిన్నటి వరకు పిల్లలు సాయంత్రం గ్రౌండ్‌కు వెళ్లి ఆటలు ఆడితే తల్లిదండ్రులు సంతోషించేవారు కానీ నేడుమన పిల్లలు బయటకు వెళ్తే సురక్షితంగా తిరిగి వస్తారా? అనే భయం తల్లిదండ్రుల్లో ఎందుకు కలగాలి? యువత పక్కదారి పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోంది? యువతకు క్రీడలు, ఉపాధి, మంచి వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?మణుగూరు యువత భద్రత కోసం ప్రభుత్వం ఏం చేస్తోంది? నేతాజీ గ్రౌండ్ వంటి ప్రజా ప్రదేశాల్లో భద్రత, పర్యవేక్షణ ఎందుకు బలోపేతం చేయకూడదు? లాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోబోతోంది? మణుగూరు ప్రశాంతతను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది? 24 గంటలు గడిచినా... ఎమ్మెల్యే స్పందన ఎక్కడ ఈ ఘటనపై 24 గంటలు గడుస్తున్నా స్థానిక ఎమ్మెల్యే బహిరంగంగా స్పందించకపోవడం ప్రజల్లో అనేక ప్రశ్నలకు తావిస్తోంది. ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఒక కుటుంబం విషాదంలో ఉంది. మణుగూరు తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారు. ఇలాంటి సమయంలో తమ ప్రజాప్రతినిధి నుంచి స్పందన, భరోసా, స్పష్టమైన ప్రకటన ప్రజలు ఆశించడం సహజం. పోయిన ప్రాణం గురించి ఎమ్మెల్యే ఏం సమాధానం చెబుతారు? ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా ఎలాంటి చర్యలు తీసుకుంటారు? మణుగూరు యువత భద్రత కోసం ఏం చేయబోతున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం తరపున మణుగూరు ప్రజలకు ఎలాంటి భరోసా ఇస్తారు?



ఇంతటి దారుణానికి ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది?ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో బయటకు రావాలి. అయితే ప్రజల్లో కొన్ని తీవ్రమైన ప్రశ్నలు ఉన్నాయి ఎవరైనా వెనుక ఉన్నారా?" ఎవరైనా అండగా ఉన్నారనే ధైర్యంతో ఇలాంటి ఘటనకు పాల్పడ్డారా?"ఎవరిని చూసుకుని ఇంతటి దారుణానికి పాల్పడే ధైర్యం వచ్చింది?"ఇవి ప్రస్తుతం ప్రజల్లో వ్యక్తమవుతున్న ప్రశ్నలు మాత్రమే. ఎవరినీ ఆధారాలు లేకుండా నిందించడం కాదు.కానీ నిజం బయటకు రావాలి.ఎవరైనా తప్పు చేసి ఉంటే వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాలి. చట్టం అందరికీ సమానంగా ఉండాలి.తల్లిదండ్రులు భయపడే మణుగూరు కావాలా? ఒక తండ్రి తన కొడుకు బయటకు వెళ్తే సురక్షితంగా తిరిగి రావాలని కోరుకుంటాడు.ఒక తల్లి తన బిడ్డ భవిష్యత్తు గురించి కలలు కంటుంది.కానీ నేడు,నా బిడ్డ బయటకు వెళ్తే సురక్షితంగా తిరిగి వస్తాడా? అనే భయం తల్లిదండ్రుల మనసులోకి రావాల్సిన పరిస్థితి ఎందుకుయువతను క్రీడల వైపు నడిపించాలి. ఉపాధి వైపు నడిపించాలి. మంచి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి. యువత చేతిలో పుస్తకం ఉండాలి, క్రీడా సామగ్రి ఉండాలి, ఉద్యోగ అవకాశం ఉండాలి --- నేరం కాదు!ఇది కాంగ్రెస్ ప్రభుత్వం అర్థం చేసుకోవాల్సిన బాధ్యత. మణుగూరు మాత్రమే కాదు --- తెలంగాణ యువత భవిష్యత్తుపై ప్రశ్న మణుగూరులో జరిగిన ఘటనను కేవలం ఒక స్థానిక సమస్యగా కాంగ్రెస్ ప్రభుత్వం చూడకూడదు.రాష్ట్రవ్యాప్తంగా యువత భద్రత, ఉపాధి, క్రీడలు, డ్రగ్స్ నియంత్రణ, మంచి సామాజిక వాతావరణం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో యువత కోసం చేపట్టిన కార్యక్రమాలను తెలంగాణ ప్రజలు చూశారు.మరి ఇప్పుడు రేవంత్ రెడ్డి గారి కాంగ్రెస్ ప్రభుత్వం యువత భద్రత, ఉపాధి, క్రీడలు, భవిష్యత్తు కోసం ఏ దిశలో ముందుకు వెళ్తోంది?ప్రజలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలి.అప్పుడు మణుగూరులో భరోసా... ఇప్పుడు భయమా? బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి చేసిన నేతాజీ గ్రౌండ్‌లో నేడు ఇలాంటి ఘటనపై ప్రజలు ప్రశ్నలు అడుగుతున్నారు.మణుగూరు యువత భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోంది?మణుగూరు తల్లిదండ్రులకు ఎలాంటి భరోసా ఇస్తోంది?స్థానిక ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదు? ఈ ఘటనకు సంబంధించిన పూర్తి నిజాలను ఎప్పుడు ప్రజల ముందుకు తీసుకువస్తారు? బి ఆర్ యస్ పార్టీ తరపున కాంగ్రెస్ ప్రభుత్వానికి మా డిమాండ్లు, సింహాద్రి శివ మృతి ఘటనపై నిష్పక్షపాతంగా, సమగ్రంగా దర్యాప్తు చేయాలి. ఘటనకు అసలు కారణాన్ని పూర్తిగా బయటపెట్టాలి. ఘటనలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.ఎవరైనా వెనుక నుంచి ప్రోత్సహించినట్లు ఆధారాలు ఉంటే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి. నేతాజీ గ్రౌండ్ సహా మణుగూరులోని ప్రజా ప్రదేశాల్లో భద్రత, పర్యవేక్షణ పెంచాలి. యువతను క్రీడలు, ఉపాధి, సామాజిక కార్యక్రమాల వైపు నడిపించే కార్యక్రమాలను బలోపేతం చేయాలి.మణుగూరు యువత భద్రతపై స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి ప్రజలకు స్పష్టమైన భరోసా ఇవ్వాలి. ఇది రాజకీయాల కోసం కాదు... ప్రజల కోసం ప్రశ్న ఒక యువకుడి ప్రాణం పోయింది.ఒక కుటుంబం కన్నీటిలో ఉంది.మణుగూరు తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారు.అందుకే మేము అడుగుతున్నాం ప్రజలు ప్రశ్నించాలి, తల్లిదండ్రులు ప్రశ్నించాలి. బి ఆర్ యస్ పార్టీ ప్రశ్నిస్తోంది, కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి!
మణుగూరుకు భయం కాదు --- భరోసా కావాలి.
యువతకు గొడవలు కాదు --- మంచి భవిష్యత్తు కావాలి.
ప్రజలకు హామీలు కాదు --- భద్రత, న్యాయం, సమాధానాలు కావాలి! అప్పుడు మణుగూరులో భరోసా... ఇప్పుడు భయమా?" బి ఆర్ యస్ పార్టీ యువజన విభాగంపినపాక నియోజకవర్గం మణుగూరు పిల్లి అఖిల్ కుమార్ తీవ్రంగా ఖండించారు.

# నిరుద్యోగుల వద్ద కోట్ల రూపాయలు దండుకున్న
# భద్రాచలం ఎమ్మెల్యే పిఏ ను కఠినంగా శిక్షించాలి బాధితులకు న్యాయం చేయాలి.

- ఎమ్మెల్యే పిఏ కళ్యాణ్ నీ విచారిస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయి.
- నేరస్తుని విచారించి అసలు కారకులు ఎవరో తేల్చాలి.
- సి పి ఐ ఎం ఎల్ మాస్ లైన్ డిమాండ్.

**భద్రాచలం ఆగస్టు 29 మన మీ వార్త:** భద్రాచలం పట్టణంలో అశోక్ నగర్ కాలనీలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో సి పి ఐ ఎం ఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. మణుగూరు, బూర్గంపాడు, అశ్వాపురం , పినపాక మండలాలలో 80 మంది తదితర చోట్ల నుండి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి రిక్షా వారి దగ్గర నుండి మధ్యతరగతి కుటుంబాల్ని వదిలిపెట్టకుండా వసూళ్లకు పాల్పడ్డాడని ఆయన అన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో 10 లక్షల నుండి 30 లక్షల వరకు నిరుద్యోగుల్ని మోసగించి దాదాపు పది కోట్లు వరకు అక్రమంగా వసూలు చేసిన భద్రాచలం ఎమ్మెల్యే పిఏ కళ్యాణ్ పట్టణంలో చర్చనీయంగా ఉందని ఆయన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆ మోసకారుడుని ఇప్పటికి అరెస్టు చేయకపోవడం పట్టణ ప్రజల్లో భయా ఆందోళనలకు ఆవేదనలకు




గురిచేస్తుందని ఆయన అన్నారు. అనుమానాలకు తావిస్తుందని గతంలో ఇసుక ర్యాంపు ల అనుమతుల విషయంలో కూడా కుంభకోణం జరిగినట్లు వచ్చిన వార్తలు మరవకముందే ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కోట్ల రూపాయలు నిరుద్యోగుల నుండి వసూలు చేయడం నమ్మించడం ఏ బలం అండతో జరిగిందో పరిశీలించాల్సిన విషయాలు ఉన్నాయని అన్నారు. వీటికి సంబంధించి సంబంధిత అధికారులు పోలీసులు నిర్ధారించి భవిష్యత్తులో జరగకుండా చర్యలు తీసుకోవాలని కఠినంగా చర్యలు తీసుకోవాలని బాధితులకు న్యాయం చేయాలని సిపిఎంఎల్ మాస్ లైన్ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కె. కల్పన, దాసరి సాయి, మునిగేలా శివ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను
# వార్షిక తనిఖీ చేసిన డీఎస్పీ అరుణ్ కుమార్.

- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి.

**భద్రాచలం ఆగస్టు 29 మన మీ వార్త:** వార్షిక తనిఖీల్లో భాగంగా భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించి సిబ్బంది విధుల నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్ ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. భద్రాచలం పట్టణంలో ట్రాఫిక్‌ను కమబద్ధీకరించేందుకు నిరంతరం చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్, దేవాలయాల పరిసరాలు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ





ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్ 2.0లో ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని సూచించారు. బ్లూకోల్ట్స్ వాహనాలతో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయాలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే నియంత్రించాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ తిరుపతి ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.